తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | శనివారం | 23 - 05 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజిలు : 1

# చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



## తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ డైరెక్టర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

- ప్రజలకు న్యాయం చేస్తేనే ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై నమ్మకం
- నిజాయితీగా పనిచేసే పోలీసులకు ప్రజల్లో గుర్తింపు
- మోత్కూర్‌లో సీఐ, డీఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని జర్నలిస్టుల వినతి

**ప్రజావారధి/మోత్కూరు**

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండటం లేదని, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మేధావులు, మీడియా, ఎన్‌జీవో సంస్థలు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ డైరెక్టర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. చట్టాలపై ప్రజలకు కనీస అవగాహన ఎంతో అవసరమని, చట్టాలపై అవగాహన ఉంటే ప్రభుత్వ వ్యవస్థలను సరైనరీతిలో ప్రజలు ఉపయోగించుకునే అవకాశముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పోలీసులు న్యాయంగా, నిస్పక్షపాతంగా వ్యవహరిస్తే ప్రజలకు పోలీసులపై నమ్మకం, విశ్వాసం పెరుగుతుందని, నిజాయితీగా పనిచేసే పోలీసులకు ప్రజల్లో ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడు సహకరించాలన్నారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలు ప్రజల రక్షణకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్లకు వెళ్లిన ప్రజలకు ఏవైనా ఇబ్బందులు జరిగినా, పోలీసులకు కూడా ఇబ్బందులు ఎదురైనా పోలీస్ ఫిర్యాదుల అథారిటీ దృష్టికి తీసుకవస్తే వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. టెక్నాలజీ రోజురోజుకు పెరుగుతున్నందున సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నిజాలు వెలికితీసే జర్నలిస్టులను, సమాచారం సేకరించే ఆర్టీఐ కార్యకర్తలను బ్లాక్ మెయిలర్లుగా ముద్రవేసి దాడులు చేయడాన్ని ఆయన ఖండించారు. పాలనలో పారదర్శకత, ప్రజల్లో జవాబుదారీతనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతుగా కృషి చేయాలని కోరారు. అనంతరం మోత్కూర్‌లో సీఐ, డీఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ మోత్కూరు నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. సీఐ, డీఎస్పీ కార్యాలయాల ఏర్పాటు కోసం పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

